


# 'మోహినీ' మోహనం

## శాంతి నారాయణ

రామకృష్ణ తోట దగ్గరికి పోలేదు. భార్య చెప్పింది కానీ తనకు ఇష్టంలేక పోలేదు. సుబ్బారెడ్డి ఇంటికెళ్లి కాఫీనీళ్లు తాగి కాసేపు టవును సంగతులు మాట్లాడి పొద్దుబుచ్చుకున్నాడు. అక్కడ్నుంచీ రంగయ్యనాయుడింటికి వెళ్లి, టవున్లో పెరిగిపోతున్న ఇండ్ల స్థలాల ధరలను గురించీ, వాటి అమ్మకాలను గురించీ బ్రోకర్ల కష్టాలను గురించీ చర్చించి, అక్కడా కాసిన్ని టీనీళ్లు తాగి కాలంగడిపి, యేమి గుర్తుకొచ్చిందో యేమో ఆదరాబాదరా యింటికొచ్చినాడు.

తోట దగ్గరికి పోకుండా పరాయోళ్ల యిండ్ల దగ్గర పొద్దుబుచ్చి వొచ్చిన మొగున్ని దండిస్తూ వంటపని చూడసాగింది నాగమ్మ. ఆమె మాటలేవీ పట్టించుకోకుండా, పొంతలో కాగిన నీళ్లను బక్కెట్లోకి తోడుకొని బచ్చలి గదిలోకి వెళ్లి తలుపేసుకున్నాడు రామకృష్ణ.

అనంతపురంలో డిగ్రీ రెండో సంవత్సరం చదివే దీపికా పదో తరగతిలో వుండే రాధికా బస్సొచ్చే టైం అయిందని తల్లిమీద విసుక్కుంటున్నారు. ప్రతిరోజూ మాదిరే ఆరోజు తొందరగా నిద్ర లేవనందుకు తన్ను తాను తిట్టుకుంటూ అలారం మోగని గడియారాన్నీ తెల్లవారుజామున గట్టిగా కూయని కోడినీ బారెడు పొద్దెక్కేదాకా గుర్రుబెట్టి నిద్రబోయిన మొగున్నీ నిందిస్తూ పిల్లలకు ప్లేట్లలో వేడివేడి అన్నం పెట్టి పప్పువేసి కొంగుతో ముఖం తుడుచుకోసాగింది నాగమ్మ. బస్సు వెళ్లిపోతుందేమోనని తాపత్రయపడుతూ ప్లేట్లలోని వేడి వేడి అన్నం తినడానికి అవస్థ పడుతున్న పిల్లల్ని చూసి గొణుగుతూ విసనకర్రకోసం వెంపర్లాడి తెచ్చి వాళ్ల పక్కన కూర్చొని విసరసాగింది. రెండు నిమిషాల్లో నాలుగు ముద్దలు నోట్లో వేసుకొని గబగబా చేతులు కడుక్కొని పుస్తకాలు తీసుకొని, బస్సు హార్న్ విని పరుగులాంటి నడకతో వెళ్లిపోయినారు పిల్లలు. వెళుతున్న పిల్లలవైపు చూస్తూ బరువుగా నిట్టూరుస్తూ దొడ్లోకి వెళ్లి ముఖం కడుక్కొని వచ్చింది నాగమ్మ. అంతలోనే రామకృష్ణ స్నానం ముగించుకొని వచ్చి పీటమీద కూర్చున్నాడు.



నాగమ్మ నిమ్మళంగా మొగునికి అన్నం వడ్డించి దగ్గర కూర్చొని విసనకర్రతో విసురుతూ వుంది. పిల్లల చదువుల్ని గురించీ, కూతురుకు వస్తున్న పెళ్లి సంబంధాలను గురించీ మాట్లాడుకుంటున్నారు. అంతలో టేబుల్ మీదున్న సెల్‌ఫోన్ రింగయింది. నాగమ్మ వెళ్లి సెల్ తెచ్చి యిచ్చింది.

'హలో, యెవురు సార్? ఆ... మీరా, నమస్కారం సార్! ఆ సైటా సార్? ఆయన శానా గట్టిగా వుండాడు సార్! సెంటు రెండూ యిరవ్వైకి తగ్గనంటా వుండాడు. మీరు గినా వొగ నెలలోపల రిజిస్టర్ చేయించుకుంటామంటే పది సెంట్ల మిందా వొగ లక్ష రూపాయలు తగ్గిచ్చుకోవచ్చు సార్!... యేమి సార్? ... యేమో, డౌటే ననుకుంటా! మీరు కానే కావల్లంటే టోకన్‌కోసరం వొగ రెండు లక్షలు తీసుకోనొచ్చి, ఇరవై లక్షల మింద గట్టిగా కూర్చోండి సార్, నేను మాట్లాడతాను! అంతకంటే పైసా గూడా తగ్గడనుకుంటాను. దుడ్లతో అవసరమున్నోడయితే గద సార్ తగ్గుతాడు! ఆయనకేం, మహానుభావుడు, సొండుగా వుండాడు! అయినా స్థలాల రేట్లు గూడా అట్లే వుండాయిలేండి! యిది, మంచి కార్నర్ బిట్టు గద

సార్! పైగా మెయిన్ రోడ్డుకు! బ్రహ్మాండమైన కాంప్లెక్సుకు పనికొస్తాది! సరే సార్...! మరి, నా కమీషన్ మరిచిపొయ్యేరు సార్! ... రెండు పర్సెంటే! ... లేదు లేదు సార్! మీరు యెవ్వరినయినా విచారించుకోండి! ... సరే సరే సార్' అంటూ సెల్ బటన్ నొక్కి కిందబెట్టినాడు రామకృష్ణ. గ్లాసులో నీళ్లు తాగి ముద్ద నోట్లో పెట్టుకున్నాడు.

సెల్‌ఫోన్ మళ్లీ రింగయింది. చేతికి తీసుకొని నంబర్ చూసినాడు రామకృష్ణ. ఈసారి అతని ముఖంలో వెన్నెల వెల్లివిరిసింది. సంతోషంగా మౌనభాషతో భార్యకేదో చెప్పి, 'హలో! సార్ సార్, నమస్కారం సార్! యిప్పుడే మిమ్మల్ని గురించి అనుకుండాను. అదే సార్, మీ రేటు వాళ్లకు చెప్పినాను. వాళ్లకు మన సైటేమో నచ్చింది గానీ అక్కడ వోవర్ బ్రిజ్జి పడుతుందేమోనని అనుమానపడుతున్నారు సార్! అందుకే రోంత తటపటాయిస్తా వుండారు. ఆటికీ నేను, 'అవన్నీ వొట్టి రూమర్స్' అని గట్టిగానే చెప్పినాను సార్! అయితే మనలో మాట! వోవర్ బ్రిడ్జి వొచ్చేది వాస్తవమేనని మొన్న యెమ్మెల్యే తమ్ముడు, మాటల సందర్భంలో చెప్పినాడు సార్! బ్రిడ్జేగినా వొస్తే, మన స్థలం దాటి ఆ ఆంధ్రాబ్యాంకు సందు వరకూ వుండే షాపులకూ స్థలాలకూ పెద్ద దెబ్బేనని అనుకుంటా వుండారు. యిట్ల అంటా వుండానని మీరేమి అనుకోకపోతే వొగ మాట సార్! సెంటు రెండు లక్షలయితే మంచి బేరమనుకోండి! మీరు సరేనంటే వాళ్లను అంత దంకా లాక్కొని వస్తాను... సరే సరే సార్! మరి నా కమీషన్ మరిచిపోవద్దండి! ... వొగ పర్సంటే సార్! ... యేమి సార్? ... లేదు లేదు సార్! మీరు యెవురినయినా అడిగి తెలుసుకోండి! ... సరే, సరే సార్!' అని సెల్ కింద పెట్టినాడు రామకృష్ణ. అతనికిప్పుడు యేదో సాధించినంత తృప్తిగా వుంది. తొందరగా భోజనం ముగించి అనంతపురం బయలుదేరడానికి సిద్ధమయినాడు.

'అయితే అనంతపురానికి పోతాండావేమయ్యా? ఈ పొద్దు మడి నాటల్లని కూలోళ్లను గూడా పిలిచినాము గదా! యిట్లా టైములో పోతే యెట్లని? కూలోళ్ల దగ్గరుండి మడి నాటిచ్చుకోకుండా యేంది నువ్వు చేస్తావుండే పని? ఇంటి మనిషి దగ్గర ల్యాకుంటే, వొప్పందం చేసుకోని మడి నాటేవాళ్లు సరిగా నాటుతారనుకుండావా? నేనొగ దాన్నే ఆడమనిషిని యా పని అని చూసుకుండేది?' గట్టిగా అడుగుతూ నాగమ్మ ముసురు పళ్లెం తీసి కడిగిపెట్టి వచ్చి జెగితిమీద కూర్చుంది.

రామకృష్ణ ఆమె మాటలు వింటూ చెక్క బీరువాలో వున్న ఇస్త్రీ బట్టలు బయటికి తీసి మడతలు విప్పుతూ నాగమ్మవైపు చూసి తల దించుకున్నాడు.

'నేనడుగుతా వుంటే యేంది, బెల్లం గొట్టిన రాయి మాదిరి వులక్కుండా పలక్కుండా అట్లుండావు?' కసురుకుంది నాగమ్మ.

'ఇప్పుడు నువ్వు కొత్తగా అడిగేదేముంది? యెప్పుడూ వినే పాత పాటేగదా! నీకెన్నిసార్లో చెప్పినాను, తోటను పాలికానికి యిచ్చినంక మనం దగ్గర యెందుకుండల్లని! ప్రతిదీ సరిగ్గా చూసుకోని పంట బాగా పండిచ్చుకోవల్లని పాలికానికి మాత్రం వుండదా? నసిపోసిన దగ్గర్నుంచీ పంట వొడుపుకుండేదంకా పాలికాడు బాగా చూసుకుంటే గద, మంచి పంటొచ్చేది! పంట బాగ పండితే గద, వానికీ గిట్టుకుండేది! ఇంటినిండా పశువుల్ని కట్టుకోని దాండ్లను పెంచుకోలేక, కూలోల్లతో యేగలేక, వొంటిగాళ్లం యెందుకీ తిప్పలని బండీగిత్తలన్నీ అమ్మి తోటనంతా పాలికానికి యిస్తిమి! ఇంగ నీకెందుకంత తాపత్రయం? అన్నం తిని, వూరకనే తోట దగ్గరికి పోయి వొగసోట నువ్వు కూర్చుంటే సాలు, పాలికాడే పనులన్నీ చేయిస్తాడు. దానికల్లా నేను రావల్లనా?' అంటూ బట్టలు వేసుకున్నాడు రామకృష్ణ.

'తోటను పాలికానికి యిచ్చినామని మనం ఆ పక్కకే తిరిగి సూడకుంటే యెట్లా? నీకేమన్న అర్థమయితా వుందా? పొలం దున్ని అదునుజేసి పంటకు నీళ్లు కట్టుకుంటా పొలాన్ని చూపెట్టుకోని వుండడమే గద పాలికాని పని! పెట్టుబడి పెట్టినోల్లకు మనకు యెదారుండల్లగానీ పాలికానికి యెందుకుంటాది? యిత్తనం గింజల కాట్నుంచీ యెరువులకూ మందులకూ కూలోల్లకూ అన్నిటికీ మనం బోడిచ్చుకోని, వూరకనే సేద్యం జేసి నీళ్లు పెట్టినోనికి నాలుగింట వొగభాగం పంట పంచియ్యడమంటే దీన్ని యేమనుకోవల్ల? రైతులు చేసే పనులేనా యివి? యివి కాదని, కూలోల్లను మాట్లాడడం ఎరువుల మూటలెత్తి పంపడం యిట్లా పనులన్నీ పాలికాల్లకు అప్పజెప్పితే వాళ్లను నమ్మే కాలమా యిది?' అంటూ బాధపడింది నాగమ్మ.

'అందుకే గదే, నిన్ను తోటకాటికి పొమ్మంటా వుండేది! వూరకనే నన్ను యాల సతాయిస్తావు? ఈరోజు నేను అనంతపురం పోకుంటే నోటి దగ్గరికొచ్చిన కమీషన్ జారిపోతాది. ఈ ముదనష్టం వ్యవసాయంలో యెన్ని దినాలు బురద పూసుకుంటే అన్ని దుడ్లు సూడల్ల? ఆ తిప్పయ్యతో సుబ్బారావుకు టోకన్ యిప్పించి వారం దినాలలో అగ్రిమెంటు చేయిస్తే యాభై, అరవై వేలు కమీషన్ చేతికొచ్చినట్లే గదా! అంత లెక్క వ్యవసాయంలో యెప్పుడు మిగలల్ల? ఇట్లా గిరాకీ మూన్నెల్లకు వొగ సారి దొరికితే సాలు! నువ్వేమో భూమిని నమ్ముకున్నోడు యెప్పుడూ చెడిపోడని అంగలారుస్తా వుండావు! పదీ పదైదు సంవత్సరాలాయ, ఈ సేద్యంలో వొగ సంవత్సరమయినా పదివేలు మిగిలిందా? యేడుకేడుకు అప్పు పెరగడమూ దిగులు పడడమే అయ్యింది గానీ ప్రాణానికి నిమ్మళంగా వుందా? యింగ ఈ వ్యవసాయం పనికిరాదని వొగ సంవత్సరం నుంచీ ఈ దారి చూసుకోవడం వల్లనే గదా సంసారం నడుస్తా వుండేది! యెంత తొందరగా వీలయితే అంత తొందరగా దీని పీడ వొదిలిచ్చుకోవల్లని నేననుకుంటా వుంటే నువ్వేమో యిదే స్వర్గమనుకుంటా వుండావు!' అంటూ తల దువ్వుకొని బయలుదేరినాడు రామకృష్ణ.

గంజి పెట్టిన తెల్లని ఖద్దరు బట్టలు వేసుకొని జెగితి మెట్లమీద నుంచీ కిందికి దిగుతున్న రామకృష్ణ, ఒక చిన్నపాటి రాజకీయ నాయకుని మాదిరి కనిపిస్తున్నాడు. జెగితి కిందున్న గూట్లోనుంచీ నల్లటి చెప్పులు బయటికి లాక్కొని కాళ్లకు తొడుక్కుంటున్నాడు. అంతలోనే ఇంటి ముందునుంచీ

**తోటను పాలికానికి యిచ్చినామని మనం ఆ పక్కకే తిరిగి సూడకుంటే యెట్లా? నీకేమన్న అర్థమయితా వుందా? పొలం దున్ని అదునుజేసి పంటకు నీళ్లు కట్టుకుంటా పొలాన్ని చూపెట్టుకోని వుండడమే గద పాలికాని పని! పెట్టుబడి పెట్టినోల్లకు మనకు యెదారుండల్లగానీ పాలికానికి యెందుకుంటాది? యిత్తనం గింజల కాట్నుంచీ యెరువులకూ మందులకూ కూలోల్లకూ అన్నిటికీ మనం బోడిచ్చుకోని, వూరకనే సేద్యం జేసి నీళ్లు పెట్టినోనికి నాలుగింట వొగభాగం పంట పంచియ్యడమంటే దీన్ని యేమనుకోవల్ల? రైతులు చేసే పనులేనా యివి?**

దుమ్ము లేపుకుంటూ సుబ్బారెడ్డోళ్ల టాటా సుమో రంగయ్యనాయుడోళ్ల జీపూ రయ్యమని వెళ్లిపోయినాయి.

'చూస్తివా, ఆ సుబ్బారెడ్డీ, రంగయ్యనాయుడూ ఏమి తోజుగా వుండారో? వాళ్లకంటే వ్యవసాయమా మనది? మొన్నమొన్నటిదంకా అప్పుల్లో వుండే వాళ్లు ఈ పొద్దు యాటికి యెదిగినారో చూడు! చూస్తా చూస్తా వుండంగనే పాత యిండ్లు పడగొట్టి బ్రహ్మాండంగా భవంతులు కట్టుకుండ్రి! రొన్నాళ్ల కిందటే ఈ బండ్లు తెచ్చుకుండ్రి! ఇదంతా వ్యవసాయం వల్లనే జరిగిందనుకుంటివా? ... సరే సరే! ఇప్పుడు నీకేమీ అర్థం కాదులే! నేను పొయ్యొస్తాను' అంటూ మోపెడ్ ఎక్కి వెళ్లిపోయినాడు రామకృష్ణ.

నాగమ్మ బరువుగా నిట్టూరుస్తూ తన మొగుడు పోతున్న మార్గం సరైనదో కాదో నిర్ణయించుకోలేక అట్లే యెక్కడో తిక్కచూపులు చూస్తూ ఆలోచిస్తూ, పాలికాని కొడుకులు రావడంతో తేరుకుంది. రెండు నైట్రేట్ మూటలు వాళ్లకు ఎత్తించి గబగబా నాలుగు మెతుకులు తిని తోట దగ్గరికి బయలుదేరింది.

నాగమ్మ సంసారానికొచ్చి ఇరవై సంవత్సరాలయింది. ఇప్పుడామె వయస్సు నలభై. ఆలమూరులో ఒక మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన నాగమ్మకు పైచదువుల మీద ఆసక్తి వున్నా కుటుంబపు కట్టుబాట్ల కారణంగానూ అప్పటికి ఆ వూర్లో అంతకుమించి చదువుకోవడానికి వీల్లేకపోవడం చేతనూ ఐదో తరగతితోనే ఆమె చదువు ఆగిపోయింది. రైతుబిడ్డ కావడం వల్ల చదువంటే ఎంత ఇష్టమో వ్యవసాయంపైన కూడా అంతే ఇష్టాన్ని పెంచుకున్న నాగమ్మ, పెళ్లయి అత్తగారింటికి

ఏడెనిమిది సంవత్సరాల నుంచీ సరిగా వానలు పడక బోర్లన్నీ యెండిపోయి తోటంతా బీడు పడి 'పాయ! యెలిపొలంలో పంట గుడకా దుసి పోబట్టె! ఇసారి వాన్దేవుడు కనికరిచ్చినాడేమో, వానలు బాగనే పడె! శానా యేండ్లయినంక దర్మవరం కాలవకు తుంగబద్ర నీళ్లొచ్చి, భూమిలో తనువు పెరిగిందేమో, యెండిపోయిన బోర్లన్నీ మల్లా కలకలలాడతాండాయి. ఇట్లా తప్పుడు తోటంతా సొంతంగా చేసుకోని పంట పెట్టుకుంటే యెంత బాగుంటాది! నీళ్లుండల్ల గానీ ఈ భూమిలో బంగారు పండదా? కొత్త కొత్త పంటలొచ్చినాయి, యా పంట పెట్టుంటే యెవురొద్దంటారు?

వచ్చిన తర్వాత తన పుట్టింటి మాదిరే మధ్యతరగతి కుటుంబమయిన తన మెట్టినింటి సంసారంలో కూడా కలిసిపోయింది.

కుటుంబ వ్యవహారంలో వ్యవసాయం చేయించడంలో స్వేచ్ఛ వున్నా, తప్పటడుగులు వేస్తున్న మొగునితో చేదోడువాదోడుగా నిలిచిన నాగమ్మ చివరికి తానే ఆ యింటి వ్యవసాయానికి పెద్ద దిక్కయి ఆ వూర్లో ఆ యింటిని మంచి రైతు కుటుంబంగా నిలబెట్టింది. అటువంటి నాగమ్మ ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో పడిపోయింది.

గతాన్ని గుర్తు చేసుకుంటూ బరువుగా తోట వైపు నడుస్తూ వుంది నాగమ్మ. ఆమె మనసంతా ఆందోళన చెందుతూ వుంది.

ఏడెనిమిది సంవత్సరాల నుంచీ సరిగా వానలు పడక బోర్లన్నీ యెండిపోయి తోటంతా బీడు పడిపాయ! యెలిపొలంలో పంట గుడకా దుసి పోబట్టె! ఇసారి వాన్దేవుడు కనికరిచ్చినాడేమో, వానలు బాగనే పడె! శానా యేండ్లయినంక దర్మవరం కాలవకు తుంగబద్ర నీళ్లొచ్చి, భూమిలో తనువు పెరిగిందేమో, యెండిపోయిన బోర్లన్నీ మల్లా కలకలలాడతాండాయి. ఇట్లా తప్పుడు తోటంతా సొంతంగా చేసుకోని పంట పెట్టుకుంటే యెంత బాగుంటాది! నీళ్లుండల్ల గానీ ఈ భూమిలో బంగారు పండదా? కొత్తకొత్త పంటలొచ్చినాయి, యా పంట పెట్టుంటే యెవురొద్దంటారు? సీడ్‌లెస్ ద్రాక్షా బొప్పాయీ మంచి లాబాలొచ్చే పంటలంట! ఈ మొగోడు చదువుకుండాడు గదా, అన్నీ తెల్సుకోని కొత్తకొత్త పంటలు పెట్టి శ్రద్దగా చూసుకుంటే యెంత లక్షణంగా వుంటాది! కడాకు, వుండే భూమిని గూడా జారిడసల్లని ఈ మనిషి ఈ మద్దెలో అనుకుంటా వున్నెట్లుంది! వుండాగా బతకల్సిన బతుకునొదిలి ఆ టవున్లో హోటల్లల్లో యెవుడు పోపిచ్చే టీనీళ్లు తాగుతా నానాకోల్లకూ సలాము గొడతా నంగినంగి కూతలు కూసుకుంటా బ్రోకరు పని చెయిడం యెంత నామర్దా పని? ఇది రైతుకు లాయికయిందేనా? ఈ మనిషి యెందుకిట్ల తయారయిపాయ? దీనికంతా కారనం, దినామూ ఆ టవునుకు పోబట్టేనేమో! కష్టాన్ని వొదిలి త్యారగ్గా దుడ్లు సంపాయిచ్చే మార్గాన్ని నమ్ముకున్నోడు బాగుపడతాడా? ఇంటికి పెద్దదిక్కయినోడు ఇంటిపాట్న ల్యాకుంటే పిల్లోల్లు చెడిపోరా? వొక్కగానొక్క కొడుకు! బాగా చదివిచ్చుకుందామంటే వాడప్పుడే స్కూలు ఎగరగొట్టి మ్యాట్నీలకు పోతావుండాడంట! అది తెలిసి మొన్న దండిస్తే నా మీదికే మీరుకుంటా వుండాడు. ఆ టవున్లో అవేంటివో కంప్యూటర్లు వచ్చినాయంట! దాండ్లను చూసి పిల్లనాకొడుకులు కొంతమంది గబ్బుగబ్బయిపోతా వుండారంట! తండ్రి అనేవాడు సరిగ్గా ల్యాకుంటే పిల్లలు లేవుడీపసీదు పట్టకుండా వుంటారా మల్ల?

రకరకాల ప్రశ్నలతో పలురకాల ఆలోచనలతో గుండె బరువు చేసుకొని తోట చేరుకుంది నాగమ్మ. మూడించీల పైపునిండా బారెడు దూరం పడుతున్న బోరింగు నీళ్లను చూస్తూ, పిట్టక దున్ని పెల్ల తొక్కి అద్దాల మాదిరి తయారుజేసిన మడికయ్యలను గమనిస్తూ నారుమడి దగ్గరికొచ్చిన నాగమ్మ మనస్సు తేలికపడింది. అన్నీ మరిచిపోయి నారు నాటడానికి కూలోల్లను పురమాయిస్తూ తోటపనిలో నిమగ్నమైపోయింది.

***

మోపెడ్ మీద కక్కలపల్లె నుంచీ అనంతపురానికి బయలుదేరిన రామకృష్ణ, స్ప్లెండర్లలో సుజుకీలలో హీరో హోండాలలో తనను వోవర్‌టేక్ చేసి ముందుకు దూసుకుపోయిన గాండ్లపర్తి నాగిరెడ్డినీ కొత్తపల్లి పెద్దన్ననూ తన వూరి నాగన్ననూ చూస్తూ వాళ్లను అందుకోలేని తన మోపెడ్ మీద విసుక్కున్నాడు. తన చేతగానితనాన్ని నిందించుకున్నాడు. అంతటికీ కారణం వ్యవసాయమేనని దాన్ని ఈసడించుకున్నాడు. కుటుకుటుమని శబ్దం చేస్తూ కుంటుతున్నట్లున్న మోపెడ్ మీద కోప్పడుతూ ముందుకు పోతున్నాడు. పోతూపోతూ తనలోని అసంతృప్తిని కూడా లెక్కచేయకుండా పైకి వుబికి వస్తున్న కొత్తకొత్త ఆశల్ని పక్కనపెట్టలేకపోతున్నాడు. ఆ ఆశలు రెక్కలు కట్టుకొని తేలిపోతున్నాయి. అవి, టౌన్లో ఇండ్ల స్థలాలవైపూ కమీషన్ల వైపూ చూస్తున్నాయి. తనను వెనకేసిపోతున్న మోటార్ బైకులను దాటి మహీంద్రా జీపులనూ టాటా సుమోలనూ గుర్తుకు తెచ్చుకుంటున్నాయి. వీలయితే ఇంకా ముందుకు పోవాలనుకున్నాయి. కానీ ఇప్పటికి సుమోల వరకూ చాల్లే అనుకున్నాయి.

కక్కలపల్లె నుంచీ అనంతపురానికి ఆరు కిలోమీటర్ల దూరం. అనంతపురానికి చుట్టుపక్కలున్న మిగతా పల్లెల మాదిరే కక్కలపల్లె కూడా ఈమధ్య కాలంలో టౌనుమీద ఆధారపడి బతుకుతున్న వూరు. మొన్నమొన్నటిదాకా టౌను వాతావరణానికి దూరంగా దాదాపు గ్రామమంతా వ్యవసాయ వృత్తినే నమ్ముకొని నిరాడంబరంగా నిర్మలంగా వున్న కుక్కలపల్లె ఇప్పుడు ఉమా గోల్డు నెక్లెస్ మాదిరి తళుకు బెళుకులతో మురిసిపోతూ వుంది. దాని తళుకు బెళుకుల మోజులో పడిన రామకృష్ణ చాలా ఇష్టంగా ముందుకుపోతున్నాడు.

రామకృష్ణ తండ్రి సంజన్న మొన్నటివరకూ కక్కలపల్లెలో మంచి పేరున్న మధ్యతరగతి రైతు. కష్టపడి, తాతముత్తాతల ఆస్తిని రెండింతలు చేసి కొత్తకొత్త పంటలతో ఆ వూరి సాంప్రదాయక వ్యవసాయంలో మార్పు తెచ్చినాడు. అతనికి రామకృష్ణ వొక్కడే కొడుకు కావడం వల్ల గారాబంగా పెంచినాడు. ఆ గారాబం రామకృష్ణను ఇదెందుకు అదెందుకని యెప్పుడూ అడగలేదు.

చదువుకోసం అనంతపురంలో చేరిన రామకృష్ణ స్నేహితులతో హాయిగా తిరిగి ఉల్లాసంగా కాలం గడిపినాడు. ఫలితంగా పదో తరగతిలో తప్పినాడు. దానితో చదువుకునే బాధ తప్పిందని సంతోషపడి, యేదో వొక బిజినెస్ చేయాలనుకున్నాడు. అయితే సంజన్న, కొడుకును బలవంతంగా సేద్యం వైపు లాక్కొని అతనిని ఆకర్షించడానికి వాణిజ్యపు పంటలు పెట్టించి చేతుల నిండా డబ్బు చెలామణి చేసుకునేవిధంగా స్వేచ్ఛనిచ్చి పెళ్లి చేసినాడు. పరవళ్లు తొక్కుతున్న ఆ యువరైతు వయస్సుకు నేను తోడుంటానంటూ వచ్చిన నాగమ్మ అన్నివిధాలా అతని మనస్సుకు దగ్గరయింది.

చదువులోనే కాదు, వ్యవసాయంలో కూడా అనుకున్నవిధంగా ఫలితం సాధించలేని కొడుకును చూసి బాధపడిన సంజన్న, నాగమ్మ తెలివితేటలనూ వ్యవసాయం పట్ల వున్న ఆసక్తినీ గమనించి ఆమెను ప్రోత్సహించినాడు. ఆమె ఆలోచనలకు అనుగుణంగా సాగిన ఆ యింటి వ్యవసాయం వెనకటి మాదిరి కళకళలాడడం చూసి తృప్తిగా కాలం గడుపుతూ సంజన్న ఒకనాడు హఠాత్తుగా కన్ను మూసినాడు. కొంతలో కొంత తనను అదుపు చేస్తున్న తండ్రి తీరిపోవడంతో రామకృష్ణకు మరింత స్వేచ్ఛ దొరికింది. టౌనుతో అనుబంధం పెరిగింది. అనాయాసంగా సులభంగా డబ్బు సంపాదించే వాళ్లవైపు దృష్టి మళ్లింది. వ్యవసాయం కంటగింపుగా కనిపించింది. దానికితోడు ఇటీవల కొంతకాలం నుంచీ జిల్లాలో వ్యవసాయం జూదంగా మారడం కూడా అతని అభిప్రాయాలకు బలాన్నిచ్చింది. వీలయితే తోటతో పల్లెతో పూర్తిగా బంధం తెంచుకోవాలనుకొని, భార్య మనసును కష్టపెట్టడం ఇష్టం లేక తీవ్రంగా ఆలోచిస్తున్నాడు రామకృష్ణ.

నగర జీవితం వైపు ఉబలాటపడుతూ కమ్మని కలలు కంటూ అనంతపురంలోని రామ్‌నగర్ చేరుకున్నాడు రామకృష్ణ. అక్కడ నూరడుగుల మెయిన్ రోడ్డు పక్కన హోటల్ హరిప్రియ కళకళలాడుతూ వుంది. ఆ హోటల్ వల్ల ఆ రోడ్డుకు కొత్తకళ వచ్చిందో ఆ రోడ్డు వల్ల ఆ హోటల్‌కు గిరాకీ పెరిగిందో తెలియడం లేదు గానీ అనంతపురం కార్పొరేషన్‌గా మారినప్పటినుంచీ ఆ రోడ్డూ ఆ హోటలూ వింత శోభను సంతరించుకున్నాయి.

హోటల్ హరిప్రియ ముందున్న సుంకేసరి చెట్టు నీడ దట్టంగా విశాలంగా పరుచుకొని వుంది. రామ

కృష్ణ చేరుకునేటప్పటికే అక్కడ చాలామంది రియల్ ఎస్టేట్ బ్రోకర్లూ డాక్యుమెంట్ రైటర్లూ లాయర్లూ సలాలను కొనేవాళ్లూ అమ్మేవాళ్లూ చేరుకొని స్థలాల లీగల్ అంశాలనూ ధరలనూ కమీషన్లనూ గురించి మాట్లాడుకుంటూ కాఫీ టీలు చప్పరిస్తున్నారు. కొంతమంది డాక్యుమెంట్ల నకలు కాపీలను పరిశీలిస్తున్నారు.

రామకృష్ణ కాఫీకోసం ఆర్డరిచ్చి జతగాళ్ల మాటల్లో కలిసిపోయినాడు.

'చంద్రబాబు కాలనీ దాటినంక కట్టకిందిపల్లె క్రాసింగు వరకూ రోడ్డు పక్కన ఎకరా ముప్పయి లక్షలంట బావా!'

'యాడో వుండే ఆలమూరి దగ్గర యెకరా పది లక్షలంటే, యిదేమి అగాదమన్నా?'

'ఈ రోడ్డుపక్క రొంత మేలనుకో మామా! ఆ కల్యానదుర్గం రోడ్డుకయితే వానెమ్మకడుపు గాలా, రేట్లు అగ్గి కురుత్తాండాయి. ఆ కురుగుంట వంక కాడ యెకరా ఇరవై లచ్చెలతో నిన్న అగ్రిమెంటు అయ్యిందంట!'

'యెకరా ఇరవై లచ్చెలంటే యేమాయనర్రా? సెంటు ఇరవై వేలు పడె! ఇంగ లేఅవుటేసి, రోడ్లూ దిలి, ప్లాట్లు ఏసినంక యారేటుతో అమ్మల్ల'.

'ఇదేమి చెప్పుతావు పాపోడా? ఆపక్క గుత్తిరోడ్డుకూ ఈపక్క బెంగులూరు రోడ్డుకూ సూడల్ల! యాడ, తడకలేటికాడ యెకరా కోటి పలుకుతా వుంది! అంపాపురం దెగ్గిర యెకరా పది లచ్చెల్తో నిన్న అగ్గిరిమెంటు అయిందంట! యాడ అనంతపురం, యాడ అంపాపురమప్పా? సుమార్గ పదైదు కిలోమీటర్ల దూరముండదా?'

'యేందో బావా, యీ రేట్లు సూత్తావుంటే దిక్కు తెలీడం ల్యా! యీపొద్దుండే రేటు రేపు ల్యాకుండా పోతాంది. గార్ల దిన్నె దాటి కనంపల్లికాడ యెకరా నాలుగు లచ్చెలంటే దొరకడం లేదంట! రేట్లు రొంత సలీసంటే ఆ బల్లారి రోడ్డుకేనంట బావా!'

'యేమి సలీసోయ్? రాసాన పల్లి దాటి రొండు కిలోమీటర్లు లోపలికి, ఆ సెన్నారెడ్డి కాలేజీ కాడ యెకరా పన్నెండు లచ్చెల్తో మొన్న బ్యారమయిందంట!'

'ఒకచోటని కాదు తమ్ముడూ! టౌను చుట్టూ పదీ పదైదు కిలోమీటర్ల లోపల యిప్పుడున్న రేటు యింకో గంటకు వుండడం లేదు. ఆ యూనివర్సిటీ రోడ్లో మొన్నటివరకూ భూములంటే కన్నెత్తి చూసేవాడే లేడుగదా! ఆకుతోటపల్లె దగ్గర తన ఐదెకరాల తోటనంతా లక్ష రూపాయలకు ఇస్తాను తీసుకోమని నా స్నేహితుడు నోత్తమరెడ్డి మూడేండ్ల కిందట బ్రతిమాలుతూ నా వెంట తిరిగినాడప్పా! అప్పుడు నాకు మనసు రాలేదు. ఈ పొద్దు అదే తోటను యెకరా ఇరవై ఐదు లక్షల ప్రకారం అమ్మి, టోకన్ తీసుకుండాడు. దీనికేమంటావు? అందుకే దేనికయినా ప్రాప్తముండల్ల తమ్ముడూ!'

'ఇదంతా యింటావుంటే కడుపులో మంట పుడతాందర్రా! యెంతన్యాయం జేసుకుంటినో! బోర్లన్నీ యెండిపోయి దిక్కుదెలీక బంగారట్లా పొలాన్ని దుడ్లకు ఇత్తగిలిస్తినప్పా! అట్లే పెట్టుకోనుంటే యీపొద్దు యెనబై తొంబై లచ్చెలు కండ్లజూసేవాన్ని!'

'మాదీ అదేగతిలేన్నా! కాలం ఇట్లయితాదని యెవునికి గొత్తు?'

'ఈ కాలానికి మన రామకిస్న శానా అదురుస్టవంతుడప్పా! మన మాదిరి తొందరపడకుండా తోటను అట్లే నిలుపుకుండాడు. ఈపొద్దు అమ్మితే డెబ్బై యెనబై లచ్చెలకు పైన్నేగానీ తక్కువ పోదేమో! పెండ్లాం పిల్లలు పున్నెం జేసుకున్నెట్లుంది!'


'సార్, నాకు తెలీక అడుగుతాను. యెందుకిట్ల రేట్లు పెరుగుతా వుండాయంటారు? అంతింత రేటు పెట్టి బూములు కొని యేమి పాముకోవల్లని? యీ రేట్లు నిలబడతాయంటారా? ఐదరాబాదో బెంగులూరో అయితే అవి పెద్ద సిటీలు కాబట్టి యేమో అనుకో! యీడ యేముందని అంతింత రేట్లు? యావన్న ఫ్యాక్టీలు కడతారా? కంపినీ లొస్తాయా? పోనీ, యేంటివన్న కొత్తరకం పంటలు యేసుకుండెకి నీటి సవుకర్రెం వుందా? యేంది ల్యా! యిది కార్పొరేశన్ అయ్యిందని ఆకాశెంలో నుంచీ యేందన్న వూడి పడతదా? మల్ల, యావల్లన అబిరుద్ది జరుగుతాదని అంతింత లెక్కబెట్టి బూములు కొంటా వుండారు?'

'ఇదొక బూమ్ తమ్ముడూ! నువ్వు చెప్పినట్ల యేవీ రావు. అయితే దేశమంతా ఇప్పుడిదేరకంగా వుంది. లెక్కలేనంత డబ్బు కొంతమంది చేతుల్లోకి వొచ్చి పడతా వుందప్పా! వొచ్చిన డబ్బును యేం చేస్తారు మరి? అమెరికాలో లక్షల డాలర్లు సంపాదించేవాళ్లు దాన్నిక్కడ పెట్టుబడిగా పెడుతున్నారు. లక్షల డాలర్లు వొచ్చేవాళ్లకు యివి పెద్ద రేట్లు కాదప్పా! అందుకే పోటీ పెరుగుతూ వుంది. పోటీ పెరిగేకొద్దీ రేట్లూ పెరుగుతున్నాయి. దాంతో వాళ్ల పెట్టుబడి విలువా పెరుగుతూ వుంది. బ్యాంకులు చూస్తే ఫిక్సెడ్ డిపాజిట్ల మీద అర్ధ రూపాయి వడ్డీ కూడా ఇవ్వడం లేదు. పైగా, ఇప్పుడు బ్యాంకులో వేసే డిపాజిట్స్ కొంత పరిధి దాటితే ఆ విషయం తప్పనిసరిగా ఇన్‌కమ్ టాక్స్ వాళ్లకు తెలపాలి! వాళ్లకు తెలిస్తే లేనిపోని చిక్కులు గదా! అందుకే

## ఆ అడుగులెవరివి?

ప్రీతి గుక్కతిప్పుకోకుండా మాట్లాడే టాపిక్స్‌లో బాత్‌రూం ఒకటి. బాత్‌రూమూ-పరిశుభ్రత గురించి అనర్గళంగా మాట్లాడేస్తుంది. (అఫ్‌కోర్స్ ఆ మాటల్లో కొన్ని రహస్యాలు కూడా బయటపెట్టేస్తుంటుందనుకోండి.) బాత్‌రూం మాటకొస్తే- తన బాత్ రూం చాలా పెద్దదిట. ఇరుకు బాత్రూంలంటే చచ్చేంత చికాకుట. బాత్రూం గచ్చంతా లేతరంగు ఫ్లోరింగే కాబట్టి శుభ్రంగా వుంచక తప్పదంటుంది. తనక్కాస్తంత టైం దొరికినా చాలు.. బాత్ టబ్‌లో మునిగి కూర్చుంటానని చెప్తుంది. వూరికే కాదు. పుస్తకం చదివేస్తూ. (డ్రింక్ చేస్తుందా అని అడుగుతున్నారా?) ఛా. అలాంటి అలవాట్లు లేవుటలేండి. సరే ఇంటికొచ్చిన వాళ్లు ఎంతటి వాళ్లయినా సరేట.. తన బాత్‌రూంలోకి రానీదట. అరకొరా వచ్చినా.. వాళ్ల షూస్ మట్టంతా బాత్రూంకి పడ్తుందని మనసంతా పీకేస్తుందట. అంటే షూస్‌వేసుకుని వచ్చేదెవరట? (ష్! ఆ అడుగులు ఎవరివి అని మాత్రం అడక్కండి!)






యెవరూ బ్యాంకుల్లో డబ్బు పెట్టడం లేదు. చేతికొస్తున్న డబ్బును మరి ఇంకెక్కడ పెట్టాల?'

'చూస్తా వుంటే యిదంతా నీటిమీద నురగ మాదిరి వుందర్రా! చూసేకి, నురగ బొగు సొంపుగా వుంటాది! అయితే యెంత సేపుంటాదో యేమో యెవురికీ తెలీదు!'

'అట్లెందుకు అనుకోవల్లప్పా? టమేటా వుల్లిగడ్డ లట్లా పచ్చి సరుకు, మార్కెట్టుకు దిక్కుమాలినంత వస్తే రేటు డౌనవుతాదని అనుకోవచ్చు! భూములు, ఆ మాదిరి చెడిపొయ్యే పచ్చి సరుకు కాదుగదా! ఇప్పుడు వోకీలు సారు చెప్పినదాన్ని బట్టి చూస్తే ఈ రేట్లు తగ్గకపోవచ్చుననిపిస్తాది! ఏమయినా గాలి వీసేటప్పుడే తూరుపు పోసుకోవల్లంటారు! మన రామకిస్న గూడా వొగ యాభైవేలు అటో యిటో యిడిసి పారేసేది మేలు! అమ్మి, లచ్చినంగా టవున్లో ఆ లెక్కతో నాలుగిండ్లూ నాలుగు సాపులూ కొనుకుంటే మంచి బాడిగలొస్తయి. కాలిమింద కాలేసుకోని దర్జాగా బతకచ్చు!'

'మల్ల, సూడు రామకిస్నా! నువ్విస్తానంటే మంచి పార్టీ వుంది. టోకన్ గీకన్ ల్యాకుండా వొగే సారి పది లక్షలిచ్చి అగ్రిమెంటు చేసుకుంటాడు' అంటూ కుర్చీ జరుపుకుంటూ నాగిరెడ్డి దగ్గరికొచ్చి సిగరెట్టు అంటించుకున్నాడు. రామకృష్ణ కూడా సిగరెట్టు ముట్టించుకొని పొగ నోటినిండా పీల్చి ముక్కుల్లోనుంచీ మెల్లగా వొదల సాగినాడు.

తమ వూరి దగ్గర కూడా భూములకు డిమాండు రావడం నిజంగా ఆశ్చర్యమే. చూస్తా వుంటే ఇంకా రేట్లు పెరుగుతాయేమో! కొన్నాళ్లు ఆగితే మంచిదనిపిస్తాది. వూరికిపోయి నాగమ్మతో ఆలోచన చెయ్యాల్ల! తానయితే భూమిని అమ్మనీ దేమో! చూస్తాం!

నాగిరెడ్డి మళ్లీ అడిగినాడు. కాసేపు ఆలోచన చేసి, 'ఇంట్లో అన్నీ మాట్లాడి మల్లా చెప్పుతాన్లే నాగిరెడ్డీ!' అంటూ తొందర తొందరగా మోపెడ్ ఎక్కి అరవిందనగర్ వైపు వెళ్లిపోయినాడు రామకృష్ణ.

***

'లేదు రామకృష్ణా! చెయ్యి దాటి పొయ్యింది. ఇప్పుడే అర్ధగంట కిందట మీ వూరాయనే పెద్దన్న, ఒక పార్టీని పిలుచుకొని వచ్చినాడు. సెంటు రెండున్నర లక్షలతో రేటు మాట్లాడి, మూడు లక్షలు టోకన్ ఇచ్చిపొయినారప్పా! వొచ్చే సోమవారమే అగ్రిమెంటు! మీ మనిషి రెండు లక్షలకంటే యెక్కువ పెట్టలేడని నువ్వే ఫోన్లో అంటివి గదా! అయినా వొగ నెలలోగా రిజిష్టర్ చేయించుకుంటే చూద్దాములే అని అనుకున్నాను. కానీ ఐదు లక్షలు ఎక్కువొచ్చే బేరం వస్తే యెట్లప్పా వొదులుకుండేది! నువ్వు ఫోన్లో చెప్పిన రేటుకయినా మీ మనిషి ఈరోజు ఉదయమే వొచ్చివుంటే వొప్పుకుండేవాన్నేమో! ఆయన రాకపాయ! రాకపోవడమే నాకు మంచిదయింది. సరే, చేసుకున్నోనికి చేసుకున్నంత లేప్పా! వుంటాను మరి!' అని ఇంట్లోకి వెళ్లిపోయినాడు సుబ్బారావు.

ఉదయం ముఖంలో వెల్లివిరిసిన వెన్నెల మటుమాయం కావడంతో నిరుత్సాహంగా వెనుదిరిగినాడు రామకృష్ణ. చేతికొచ్చిందనుకున్న అరవై వేల కమీషన్ జారిపోయినందుకు బాధపడినాడు. ప్లాటు మీద ఎంతో మోజుపడి కూడా ఇరవై లక్షలకు కొంచెం ముక్కపెట్టమని పిసినారితనంతో మొండిగా కూర్చొన్న తిప్పయ్యశెట్టినీ, ఉదయం ఇంట్లో కాఫీ తాగి బయలుదేరకుండా రంగయ్యనాయుడూ సుబ్బారెడ్డి యిండ్ల దగ్గర అనవసరంగా పొద్దుబుచ్చిన తన అవివేకాన్నీ, పనికిమాలిన సేద్యం సంగతులన్నీ చెప్పి ఆలస్యంగా బయలుదేరడానికి కారణమయిన నాగమ్మనూ, యాచకుడు మరొక యాచకునికి శత్రువనే సంగతి తెలిసి కూడా సుబ్బారావు ప్లాటు గురించి తిప్పయ్యశెట్టి బేరం గురించీ పెద్దన్న చెవిలో వేసిన తన మూర్ఖత్వాన్నీ, సాటి బ్రోకర్ గదా అనే సంస్కారం లేకుండా నమ్మకద్రోహం చేసిన పెద్దన్ననూ, కుంటుకుంటూ నడిచిన తన మోపెడ్‌నూ, హోటల్ హరిప్రియనూ, దాని ముందున్న చెట్టునూ, దాని కింద రియల్ ఎస్టేట్ కథలన్నీ చెప్పి తనను అనవసరంగా నిలిపిన జతగాళ్లనూ తిట్టుకుంటూ మోపెడ్ ఎక్కినాడు రామకృష్ణ.

మళ్లీ రియల్ ఎస్టేట్ బ్రోకర్ పాయింట్లన్నీ తిరిగి సాయంకాలం మూడు గంటలకల్లా మళ్లీ హరిప్రియ హోటల్ చేరుకున్నాడు రామకృష్ణ. హోటల్లోనూ చెట్టుకిందా జనం పల్చగా వున్నారు. హోటల్లో కూర్చొని కాఫీ తాగుతూ సుదీర్ఘంగా ఆలోచిస్తున్నాడు రామకృష్ణ.

రెండు మూడు నెలలుగా తాను వూర్లో లేనందువల్ల తనకు తెలీదుగానీ పొద్దున చెట్టుకింద వినినదాన్ని బట్టి చూస్తే అనంతపురం చుట్టుపక్కల భూముల రేట్లు బ్రహ్మాండంగా పెరుగుతూ వున్నెట్లుంది. జతగాళ్లు చెప్పింది రొంత యిదిగా అనిపించినా రేట్లు పెరుగుతా వుండాయనేది వాస్తవం. దానికి, సుబ్బారావు అమ్మిన ప్లాటే దృష్టాంతమనిపిస్తాది. చూస్తావుంటే తమ తోట అరవై డెబ్బై లక్షలు పలికేటట్లనే వుంది! వూరకనే యిడ్చి పారేసేది మేలు! బతికినంత కాలమూ వొంటినిండా మట్టి పూసుకోని నానా తిప్పలు యాల పడల్ల? పడితే మాత్రం మిగిలేదేముంది? నాగులు శానా తెలివిగా సేద్యం పనులు చూసుకుంటూ వొచ్చింది కాబట్టి పెద్దగా అప్పులేమీ కాలేదు. రాన్రానూ ఈ జిల్లాలో వ్యవసాయం రైతును కుంగదీస్తా వుందేగానీ బాగుజేసింది లేదు. ఈ సంగతి నాగులుకు మాత్రం తెలీదా? తోటను అమ్మి టౌన్లో ఆస్తి చేసుకుందామంటే తాను మాత్రం ఎందుకు వొద్దంటుంది? టౌను చేరుకుంటే పిల్లల చదువులూ బాగుపడతాయి. పెద్దదానికి మంచి సంబంధం చూసి కట్నమిచ్చి పెండ్లి చెయ్యొచ్చు.

'యేమి రామకిష్టా, శానా దీర్ఘంగా ఆలోచిస్తా వుండావు? యేమిటి సంగతి? అని సుబ్బారెడ్డి దగ్గరికొచ్చి పలకరించడంతో ఆలోచనల్లో నుంచి బయటపడినాడు రామకృష్ణ. తన పక్కనున్న మనిషిని, 'ఈయన తెల్సునా? శివారెడ్డి' అని పరిచయం చేసినాడు సుబ్బారెడ్డి. అతన్ని చూడగానే ఎమ్మెల్యే వాళ్ల బంధువన్న సంగతి గుర్తుకొచ్చి తల ఆడించినాడు రామకృష్ణ.

సుబ్బారెడ్డి యెప్పుడు ఆర్డరిచ్చినాడో యేమో, టేబుల్ మీదికి టీ వొచ్చింది. అదీయిదీ మాట్లాడుకుంటూ ముగ్గురూ టీ తాగుతున్నారు.

'అవును రామక్రిష్టా, ల్యాండేమో అమ్ముతావంటనే! నిజమా?' వచ్చిన సంగతి వ్యక్తంచేసినాడు సుబ్బారెడ్డి.

'యింగా కుదిరితేనే మల్లా! చూడు! అమ్మే అభిప్రాయముంటే శివారెడ్డే తీసుకుంటాడు. మంచి పార్టీ గదా! పైగా మనకు కావల్సినోడు! డుబ్బులకేమీ డోకా వుండదు. వుండూరివాన్ని నేనుండాను కాబట్టి మాట తప్పడంగానీ యెనిక్కి తిరుక్కోవడంగానీ జరగదు' అంటూ సుబ్బారెడ్డి భరోసా ఇచ్చినాడు.

రామకృష్ణ కాసేపు ఏమీ చెప్పలేకపోయినాడు. మనసులోకి తొంగిచూడసాగినాడు.

ఈ రెడ్లతో యెవారం యెందుకబ్బా? శివారెడ్డి రాజకీయాలతో సంబంధాలుండేవాడు. మనిషి కూడా రొంత జాస్తీ నాయలే! ఏమయినా జాగ్రత్తగా

వుండేది మేలు!

మనసు హెచ్చరించింది.

సుబ్బారెడ్డి అతని మౌనాన్ని గమనించి బయట చెట్టుకింద పిల్చుకొని పొయినాడు. రామకృష్ణ తన మనసులోని అభిప్రాయాన్ని వెలిబుచ్చినాడు. మరేమీ భయపడవలసిన పనిలేదని భరోసా యిచ్చినాడు సుబ్బారెడ్డి. రేటును గురించి చర్చ జరిగింది. మార్కెట్టు లగువూ బిగువూ విప్పి చెప్పినాడు సుబ్బారెడ్డి. మౌనంగా వున్న శివారెడ్డిని, యింటికి పోయిరమ్మని సైగ చేసినాడు. రేటు విషయం ఆలోచించుకోమని, ఒక గంట తర్వాత మళ్లీ కూర్చుందామని రామకృష్ణతో చెప్పి వెళ్లిపొయినాడు సుబ్బారెడ్డి.

రామకృష్ణ గట్టిగా ఆలోచన చేయసాగినాడు. అతనికయితే యిప్పుడు దిక్కుతోచలేదు. పల్లెకు వెళ్లొస్తామనుకున్నాడు. ముందుగా చెప్పితే భార్య ససేమిరా వొప్పుకోదనుకొని వెళ్లడం మానుకున్నాడు. టౌన్లోకెళ్లి పదిచోట్ల తెలుసుకున్నాడు. ఒక్కొక్కచోట వొక్కొక్క అభిప్రాయం! ఏతావాతా మనసులో సుముఖత! అటూ ఇటూ తిరిగేలోపలే గంట దాటిపోయింది. చివరికి ఒక నిర్ణయానికొచ్చి హోటల్ చేరుకున్నాడు రామకృష్ణ. అక్కడ వాళ్లిద్దరూ కనిపించలేదు. తన రేటు ఎక్కువని రాలేదేమో అనుకున్నాడు. ఇక రారేమో అనుకొని నిరుత్సాహపడుతూ పల్లెకు బయలుదేరినాడు. అంతలోనే సుబ్బారెడ్డి వొచ్చినాడు. ఆ తర్వాత శివారెడ్డి.

ఈసారి టేబుల్ మీదికి థమ్సప్ బాటిల్స్ వొచ్చినాయి. కూల్‌డ్రింక్ నోట్లోకి పీల్చుకుంటూ ఫైనల్ రేటు చెప్పమన్నాడు సుబ్బారెడ్డి. రామకృష్ణ చెప్పినాడు. కాసేపు బేరసారాలు జరిగినాయి. చివరికి అరవై ఐదు లక్షలతో రేటు తెగిపోయింది. టోకన్ కింద యాభై వేలిచ్చినాడు శివారెడ్డి. వారం రోజుల్లో పది లక్షలతో అగ్రిమెంటని, ఆరు నెలల్లో రిజిస్ట్రేషన్ అని వొప్పందం కుదిరింది. 'అన్నిటికీ పూచీ నాది' అంటూ పైకి లేచినాడు సుబ్బారెడ్డి.

***

చీకటి ముసురుకుంది. నగరం పొలిమేరల్లో నుంచీ వీస్తున్న దుర్గంధపు గాలి,కక్కలపల్లి పొలాల మీదున్న పరిమళాన్ని తరుముతూ మెల్లగా పల్లె సందుగొందుల్లోకి చొచ్చుకుంటూ వుంది.

నాగమ్మ కనుగుడ్లమీద వుబుకుతున్న నీటి తెర, పొంగి పొర్లడానికి సిద్ధపడుతూ వుంది.

'పెద్దలు సంపాదిచ్చిన ఆస్తిని అమ్మడానికి నీకు మనసెట్ల వచ్చింది? బంగారట్లా బూమి! యిప్పట్నుంచీ ప్రతి సమ్మత్సరమూ కోరకోళ్ల డ్యాము నీళ్ల దర్మవరం కాలవకు వొదుల్తారంట! వొదిల్తే నీటి సమస్యే వుండదు గదా! సంరుద్ధిగా నీళ్లున్నప్పుడు ఇష్టమొచ్చిన పంటలు పెట్టుకోని లక్షనంగా బతకచ్చు గదా! రైతంటే వొగరికి పెట్టేవాడే గాని యింగొగర్ని ఆసించేవాడు కాదు! వొగ మంచి రైతు బతుకులో వుండే వుందాతనమూ త్రుప్తీ యింగొగ బతుకులో వుంటాదా? ఇంత న్యాలను పోగొట్టుకోని టవున్లో ఆ యిరుకు కొంపల్లో యిరుకిరుకు సందుల్లో గబ్బులో మంచీచెడ్డా లేని ఆ మనుషుల మద్దెలో యెట్ల బతకల్లనుకుండావు? కన్నతల్లి మాదిరుండే బూమిని అమ్మి, కష్టం వొదులుకోని లక్షల్లక్షల దుడ్లను చూసుకుంటా పొద్దుబుచ్చే బతుకు అదొగ బతుకేనా? ఆ దుడ్లు మనిషిని వూరకనే వుండనిస్తాయా? వొగేల, యేమన్నా అయితే పిల్లల బతుకేం గావల్ల?'

నాగమ్మ గుండెల్లో నుంచీ పొంగుతున్న వేదన ముద్దలు ముద్దలుగా బయటపడుతూ వుంది. కూతురు దీపిక గొంతు తల్లిగొంతుతో కలుస్తూ వుంది. కొడుకు రవీంద్ర చూపులు తండ్రి వూహల వెంట నడుస్తున్నాయి. రాధిక నోట్లోనుంచీ అమాయకత విరబూస్తూ వుంది.

ఏడుపులూ తిట్లూ అన్నీ అయిపోయాక నాగమ్మ మౌనంగా ఎక్కడో చూస్తూ వుంది. ఇంట్లో నిశ్శబ్దం బరువుగా పొరాడుతూ వుంది. రామకృష్ణ పెదవులు మెల్లగా కదులుతున్నాయి.

'సంసారాన్ని బాగుజేసుకోవల్లని నాకు మాత్రం వుండదా? తరాలు గడిచినా ఈ చాలీచాలని బతుకులో నలిగిపోవల్సిందేనా? మన మాదిరే మన పిల్లలూ ఈడ నిక్రుష్టంగా గడపాల్సిందేనా? వ్యవసాయమ్మింద నీకెందుకంత మోజు? లోకమెట్లుందో నీకెందుకు తెలీడంలేదు? బాయిలో కప్పల మాదిరి, ఈడుంటేనే బతికినట్లా? అందరూ నీ మాదిరే అనుకుంటా వుండారా? ఎదుగూ బొదుగూ లేని ఈ బతుకెన్నాళ్లు? జెల్సాగా బతకల్లని భూమిని అమ్ముతా వుండామా? సంసారం బాగుపడేకి మంచి అవకాశమొచ్చిందని కదా! ఈ అవకాశం మల్లా వొస్తాదా? యాలంత మూర్ఖంగా ఆలోచిస్తా వుండావు?'

రామకృష్ణ ప్రశాంతంగానే అడిగినాడు. ఇద్దరి మధ్యా చాలాసేపు వాదన జరిగింది. చివరికి నాగమ్మ మెత్తబడింది.

***

అగ్రిమెంటు చేసుకున్నారు. ఆరు నెలల లోపల మిగతా పైకం చెల్లించి భూమిని రిజిష్టర్ చేసుకోవాలని రామకృష్ణ, శివారెడ్డికి అగ్రిమెంటు రాయించి యిచ్చి డబ్బు తీసుకున్నాడు. సుబ్బారెడ్డి సాక్ష్యం వేసినాడు. చేతికొచ్చిన పది లక్షల్ని బ్యాంకులో వేసిన మరుదినం నుంచే టౌన్లో ఆస్తి చేసుకోవడానికి పూనుకున్నాడు రామకృష్ణ.


ఆరోజు సాయంకాలం. హరిప్రియలో కూర్చుని కాఫీ తాగుతున్నాడు రామకృష్ణ. స్నేహితులొచ్చి విషయం చెప్పినారు.


ఎవరో తమ తోటకు, ఎకరా పది లక్షల ప్రకారం బేరం తెంచుకొని శివారెడ్డికి ఐదు లక్షల టోకన్ ఇచ్చి పోయినారట!

వింటూనే ఆశ్చర్యపోయినాడు రామకృష్ణ. కాసేపు నీళ్లు నమిలినాడు. తన దురదృష్టాన్ని నిందించుకున్నాడు. బాధపడినాడు. బరువుగా నిట్టూరుస్తూ ఇంటికి బయలుదేరినాడు. మధ్యలో రంగయ్యనాయుడు కలిసి, విషయం తెలుసుకొని వోదార్చినాడు. రియల్ ఎస్టేట్ వ్యాపార లక్షణం అదే అన్నాడు. మార్కెటు బాగున్నప్పుడు తెలివిగా పోతే శివారెడ్డి కంటే పదిరెట్లు ఎక్కువ సంపాదించుకోవచ్చునన్నాడు. తెలివీ ధైర్యమూ వున్నవాడు దినాల లోపల ఆకాశానికి ఎదిగిపొయ్యే కాలమిది అని రుజువులిచ్చినాడు.

రంగయ్యనాయుని మాటలు రామకృష్ణకు బాగా నచ్చినాయి. అందుకే గుచ్చిగుచ్చి అడుగుతూ చాలా ఆసక్తిగా విన్నాడు.

'ఇప్పుడు మార్కెట్టంతా బళ్లారి రోడ్డు పక్కమళ్లింది రామక్రిస్నా! ఇది తెలిసే, వొగ యిరవై ఎకరాలు మంచి బిట్టును అగ్రిమెంటు చేయిచ్చుకుండాను. సెయింట్ మార్క్ స్కూలు పక్కన్నే, మెయిన్ రోడ్డుకే! బ్రహ్మాండమయిన ల్యాండు లేప్పా! అయితే యేం జేస్తావు? దాన్ని యింగా రొన్నాళ్లు నిలుపుకోని, వొచ్చే లాభాన్ని అనుభవించే అద్రుస్టం లేనట్లుంది రామక్రిస్నా! యింగ వారం దినాల్లో కొడుకు మెడికల్ సీటుకోసరం పదైదు లక్షల కట్టల్ల! దిక్కు తెలీడం లేదు. యాడా సర్దుబాటు కాలేదు. అందికే దాన్ని వొదులుకోవలనుకుండాను. ల్యాకుంటే వొదులుకుండే ఆస్తి కాదప్పా






అది! దాని పక్కన్నే కొత్త బైపాస్ రోడ్డు అప్రూవల్ అయ్యిందంటా! ఆ రోడ్డేగిన వొచ్చిందిరా అంటే ఎకరా ఇరవై లక్షలంటే గూడా దొరకదు రామక్రిస్నా! వుండూరోనివి, నీ దగ్గర దాచుకోవడమెందుకు? నేను ఎకరా రెండు లక్షల ప్రకారమే అగ్రిమెంటు చేయించుకుండానప్పా! నువ్వు కావల్లంటే మూడు లక్షల ప్రకారం అగ్రిమెంటు చేయిస్తాను. అగ్రిమెంటు మింద అగ్రిమెంటా అని అనుమానపడాల్సిన పన్లేదు. వొరిజినల్ వోనర్ దగ్గరికి పిల్చుకొని పోయి అతని సమక్షంలోనే అగ్రిమెంటు చేయిస్తాను. అయితే నేను పది లక్షలకు అగ్రిమెంటు చేయించుకున్నట్లే నువ్వు గూడా అంతకే చేయించుకోవాల్సి వుంటుంది రామక్రిస్నా!' అని తన అగ్రిమెంటు జిరాక్స్ కాపీ చూపించి వెళ్లిపోయినాడు రంగయ్య.

తొందరగా పల్లెకు చేరుకోవాలనుకున్న రామకృష్ణ మనస్సు బళ్లారి రోడ్డువైపు మళ్లింది. మోపెడ్ ఎక్కి అర్ధగంటలో అనుకున్న స్థలం చేరుకున్నాడు. నాలుగు మూలలా తిరిగి చూసినాడు. ఆజూబాజును అడిగి తెలుసుకున్నాడు. వాళ్ల మాటలతో అతని మనసునిండా కొత్త ఆశలు కమ్ముకున్నాయి. డెబ్బై యెనభై లక్షలు లాభమొచ్చే సూచనలు కనిపించాయి. మనస్సు వురకలు వేసింది. అంతలోనే ఏదో సందేహం తొంగిచూసింది.

రంగయ్య రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొమ్ములు తిరిగినోడు గదా! అట్లా వాడు అంత లాభమొచ్చే ఆస్తిని ఎందుకు వొదులుకుంటాడు? ఎక్కడయినా అప్పు తెచ్చుకోని అవసరం తీర్చుకోవచ్చు గదా! అయినా పద్దెదు లక్షలు అప్పు పుట్టడమంటే ఈకాలంలో సన్న విషయం కాదు! తనే అన్నాడు గదా, ఎక్కడా సర్దుబాటు కాలేదని! నిజమే అయ్యిండమ్చు! ఇరవై ఎకరాల మింద ఇరవై లక్షలు లాభం చాల్లే అని గూడా అనుకోనుండచ్చు!

తొంగి చూసిన సందేహం తొలగిపోయింది. మనస్సు తొందరపడింది. ఆలస్యమయితే ఆస్తి దక్కుతుందో లేదోనని తాపత్రయపడుతూ రంగయ్యను కలుసుకోడానికని మోపెడ్ ఎక్కి ఎక్సలేటర్ పూర్తిగా తిప్పినాడు రామకృష్ణ.

***

ఉగాది పండగ దగ్గరికొచ్చె. అగ్రిమెంటు డేటెల్లిపోయి నెలన్నర కావొచ్చె. ఇంగ పద్దెదు దినాల్లోపల భూమి రిజిస్టర్ చేయించుకోకపోతే అగ్రిమెంటు కాన్సలయితాదని రంగయ్యనాయుడు వొగటే వొత్తిడి చేస్తా వుండాడు. రేట్లు చూస్తే పండుకుండాయి. కొనిన రేటుకు గూడా అడిగేవాడు లేడు! లాభం కత దేవుడెరుగు! అగ్రిమెంటు ప్రకారం రంగయ్యకు ఇయ్యల్సిన మొత్తమంతన్నా చేతికి రాకుంటే, ఇంగ యాభై లక్షలు యాట్నుంచి తెచ్చి భూమి రిజిస్టర్ చేయించుకోల్లబ్బా? తమ తోటను తీసుకున్న శివారెడ్డేమో యింగా ఆర్నెల్లు టైం కావల్లని అడుగుతా వుండాడు. కాదు గూడదంటే అంతో యింతో పట్టుకోని మిగతా లెక్క వాపసు ఇమ్మంటా వుండాడు. ఆ మాదిరే నాయుడు దగ్గర తానూ మాట్లాడితే అతగాడు వొప్పుకోవడం లేదు. 'వొగరకంగా లాభం చూసుకోని అమ్ముకోకుండా శానా ఆశకు పోయి ఇప్పుడు అంగలారిస్తే నేనం జేసేది? అసలైన ఆసామి వొప్పుకోనప్పుడు నేను అతని భూమిని రిజిస్టరయినా చేసుకోవల్ల, యిచ్చిన అడ్వాన్సునన్నా వొదులుకోవల్ల! నాకయినా నీకయినా ఇది తప్పదు రామకృష్ణా!' అని నిష్టూరంగా యెల్లిపొయినాడు. ఇప్పుడు ఎట్ల జెయ్యల్లబ్బా?

నాయుడుకిచ్చిన అడ్వాన్సు పది లక్షల్నీ వొదులుకుంటే శివారెడ్డికీ నేను యావల్లన డబ్బు వాపసు ఇవ్వల్ల? ఇవ్వకుంటే మా భూమిని వొదుల్తాడా? వూరకనే, అతగాడిచ్చిన పది లక్షలకు సరిపడినంత భూమిని మాత్రం రిజిస్టర్ చేయిస్తే మేలేమో! అయితే దానికి శివారెడ్డి వొప్పుకుంటాడా అబ్బా? అసాధ్యమయినోడు! పైగా ఎమ్మెల్యేకి బంధువు! గావుగుండు నాకొడుకు! ఇట్లా టైములో సుబ్బారెడ్డన్నా రొంత ముందుకొచ్చి యాదోవొగటి మాట్లాడి ఈ ఆపద నుంచి గడ్డకేస్తాడేమో అనుకుంటే అతగాడు మొగం చాటేస్తా వుండాడు. మొన్నొగసారి యెదురుపడి అడిగితే, 'మీరు మీరు ఎట్లన్నా పొర్లాడుకోండప్పా! నాకు సంబంధం లేదు' అని మొగమంతా గంటు జేసుకోని యెల్లిపాయ. ఇతగాడు ఆ పొద్దు ఏమి కూసె? వుండూరోడనే కనికరమన్నా వొద్దా?

ఆ నాయుడుగాడు కూసినట్లే నేనూ నా అగ్రిమెంటును క్యాన్సిల్ చేసుకుంటే యేమైతాది? శివారెడ్డి, ఎమ్మెల్యే దగ్గర పంచాయితి పెట్టిస్తాడా? పెట్టిస్తే ఎమ్మెల్యే తమ్మునితో మాట్లాడి, బుద్ధి గడ్డి తినిందని అంతోయింతో ఆయప్పకే ముట్టజెప్పి సమస్యను సెటిల్ చేసుకోవచ్చు! అయితే పంచాయితీ జరిగి ఆడ ఏమయితాదో? రెండు పిల్లులూ కోతి కథే అయితే? ఈమధ్యలో ఎమ్మెల్యే ఈ వ్యాపారం గూడా మొదలు పెట్టినాడంట! అయినా ఆ త్రర్‌నాకొడుకు శివారెడ్డి పంచాయితి పెట్టిస్తాడా? పెట్టించకుండా ఏదయినా దౌర్జన్యం చేస్తే..? కాలో చెయ్యో నరికేస్తే..? వోరి నాయనో! వోరి దేవుడో!

కడాకు పది లక్షలకే బంగారట్లా భూమిని వొదులుకోని, ఆ లెక్క తీసుకొని పోయి యేట్లో యేసినట్లు ఆ నాయుడుగాని చేతిలో పెట్టి చేతికి చిప్ప తీసుకుండే గతి పట్టెగదరా భగవంతుడా? వొగరెడ్లో కమ్మో కాకుండా వాళ్లతో నేనెట్ల ఢీకొందురా తండ్రీ?'

రామకృష్ణ తల తిరిగిపోతూ వుంది. నరాలు చిట్లిపోతున్నాయి. ఆదుకునే దిక్కెవ్వరూ లేక ఎటు చూసినా భయంకరంగా చీకటి కనిపిస్తూ వుంది. ఆ చీకటిలో ఒక్కసారిగా భార్యాపిల్లలు గుర్తుకొచ్చినారు. అంతే! అతని కడుపులోనుంచీ దుఃఖం అలలు అలలుగా పొంగి వచ్చింది. కళ్లనిండా నీళ్లు వూదుకున్నాయి.

ఇప్పుడు ఇంటికి యా మొగం పెట్టుకోని పోవల్ల సుంకులమ్మ తల్లీ? నాగులుకు ఏమని చెప్పల్ల? ఈ అన్యాయం వింటే తాను తట్టుకోగలుగుతుందా? తానేమయినా అయితే గతేమిటి? ఇంగ పిల్లల గతేమిటి తల్లీ? బిడ్డా, దీపికా నీకెంత అన్యాయం జేస్తినిరా?

అతని గొంతు పూడుకుపోయింది. వూదుకున్న కన్నీటి తెర ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. కళ్లల్లో మబ్బులు కమ్ముకున్నాయి. ఏమీ కనిపించడం లేదు. తానెక్కడున్నాడో తనకే తెలియడం లేదు. కానీ అడుగులు మాత్రం ఎటువైపో పోతున్నాయి.

***

వారం రోజులయినా ఇంటికి తిరిగిరాని రామకృష్ణకోసం ఆరాటపడుతూ తల్లడిల్లిపోయిన నాగమ్మ విషయం తెలుసుకొని కుమిలిపోయింది. కుమిలిపోతూనే ధైర్యం తెచ్చుకుని తన్ను తాను సముదాయించుకుని పిల్లలకు ధైర్యం చెప్పింది. గట్టిగా ఆలోచన చేసింది.

పారిపోవడం పరిష్కారం కాదని, ప్రపంచంలో అందరూ ఆస్తిపాస్తులున్నవాళ్లే కాదని, అవి లేకపోయినా ఎంతోమంది కష్టపడి బతుకుతున్నారని, ఇంట్లో కన్నబిడ్డలందరూ 'నాయన నాయన' అని కలవరిస్తున్నారని, ఎక్కడున్నా తిరిగి రావాలని పత్రికా ప్రకటన ఇచ్చింది నాగమ్మ. ఇచ్చిన మరుసటిరోజు నుంచీ కళ్లల్లో వొత్తులేసుకొని రామకృష్ణ కోసం ఆశగా ఎదురు చూస్తూ వుంది.

★